# ఆ అమ్మాయి

— ఎస్.ఎస్.ఆర్.

సత్యమూర్తి నీట్‌గా తయారై ట్రిమ్‌గా ముస్తాబై మెడికల్ కాలేజీలో జరుగబోతున్న కాలేజీ వార్షికోత్సవాలకి బయలుదేరాడు.

మెడికల్ కాలేజీ ఆడిటోరియం అంతా అప్పటికే ప్రేక్షకులతో క్రిక్కిరిసిపోయింది. ఇంతమంది జనం రావడానికి కూడా ఒక కారణం ఉంది. ఆనాటి కార్యక్రమాలకు ప్రత్యేక సినీనటి దిగంబర నర్తకి అయిన కుమారి అప్సర ముఖ్య అతిథిగా రావడమే. సీట్లు ఎక్కడ ఖాళీగా ఉన్నాయా అని సత్యమూర్తి కెమేరా లాంటి కళ్ళతో వెతుకుతున్నాడు.

...... ఎక్కడైనా ఒక్క సీటు అయినా దొరక్కపోతుందా అన్న ఆశతో. ఇంతలో ఓ మారుమూల ఒక సీటు ఖాళీగా ఉండడం కనిపించింది. అక్కడికి వెళ్ళేసరికి ఆ సీటుప్రక్కన పదహారేళ్ళ సుందరి కూర్చుని ఉంది. ఆ అమ్మాయిని చూచిన సత్యమూర్తికి చాలా ఆనందం కలిగి రబ్బరు బెలూన్‌లా ఉప్పొంగిపోయాడు. తెల్లవారి లేచి ఎవరి ముఖం చూశానోగాని ఎంత అదృష్టవంతుడ్ని. ఒకే ఒక్కసీటు ... ఆ ప్రక్కన పదహారేళ్ళ పడుచుపిల్ల... ఓహో! ఆహా!! ఏమి ఛాన్సు అని తనలో తాను అనుకుని మరల దిగులు పడిపోయాడు. ఎందుచేతనంటే ఆ అమ్మాయి ఆ సీటు ఎవరికోసమైనా ఉంచిందేమోనని. పోయిందే ముంది ఆ అమ్మాయిని సీటు ఖాళీగా ఉందో, లేదో అడగవచ్చు. తరువాత తన అదృష్టం అనుకొని జారిపోతున్న గుండెను అదుపులో పెట్టుకుంటూ ధైర్యేసాహసే లక్ష్మి అనుకుంటూ "ఏమండీ ఈ సీటులో ఎవరైనా ఉన్నారా?" అని బెదురుతూ, భయపడుతూ మెల్లగా అడిగాడు.

"కనబడటం లేదా? ఈ సీటులో ఎవరూ లేనట్టు..." అంది ఆ అమ్మాయి. ఆ అమ్మాయి చెప్పిన సమాధానానికి "చాలా పెంకి, మొండిఘటంలా ఉందే. చాలా జాగ్రత్తగా మసలాలి. లేకపోతే చెప్పుదెబ్బలే శరణ్యం" అనుకుంటూ మరేమీ మాట్లాడకుండా ధైర్యంగా సీటులో కూర్చున్నాడు సత్యమూర్తి.

రంగురంగుల తోరణాలు విద్యుద్దీపాల మధ్య ఆ అమ్మాయి ముఖం ధగధగ మెరిసిపోతోంది. ఆమె అందాన్ని అదేపనిగా చూసేసరికి మలేరియా జ్వరం వచ్చిన రోగిలా నిలువెల్లా వణికిపోతూ, ముఖం మీద పట్టిన చెమటని జేబురుమాలుతో తుడుచుకుని, బుద్ధిమంతుడిలా సర్దుకుని కూర్చున్నాడు.

ఇంతలో మొదటగా "మన్మథలీల" అనే నాటకాన్ని ప్రారంభిస్తున్నట్లు మైక్‌లో ఎనౌన్స్ చేస్తున్న సినీనటి కుమారి అప్సర వైపు ప్రేక్షకులు అదేపనిగా కనురెప్పలు వాల్చకుండా ఆమె అందాల్ని చూస్తూ ఎవరికి వారు నెమరువేసుకుంటూ, గుటకలు మ్రింగుతూ ఆమె చెబుతున్న చిన్న ఉపన్యాసానికి మాటిమాటికి చప్పట్లు కొడుతున్నారు. ఆమె చెబుతున్న ఉపన్యాసం, ప్రేక్షకులు కొడుతున్న చప్పట్లు వినబడటం లేదు సత్యమూర్తికి. అతని మనసంతా పూర్తిగా ప్రక్కసీటులో కూర్చున్న ఆ అమ్మాయి మీదే ఉంది. కాని ముఖంలోకి చూడడానికి మాత్రం ధైర్యం చాలడం లేదు.

అయినా తన తెలివితక్కువతనం పిరికితనం గాని అందమైన అమ్మాయిని తన ప్రక్కన పెట్టుకొని చూస్తూ ఊరుకుంటే కొంపతీసి ఈ అమ్మాయి తన్ను వెధవకింద జమకట్టదు కదా? ఏమైతే అయిందనుకొని సత్యమూర్తి మెల్లగా ఏమీ తెలియనట్లు తనచేయి ఆ అమ్మాయి చేతికి తగిలేట్టు ఉంచాడు. ఆ అమ్మాయి తన చేతిని వెనక్కి తీసుకోలేదు. అంతే! సత్యమూర్తికి ఎవరెస్టు శిఖరం ఎక్కినంత సంతోషం. తెలుగువాడు చంద్రమండలం వెళ్ళినంత సంతోషం, ఇంగ్లీషువాడు సూర్యమండలం వెళ్ళినంత సంతోషం కలిగింది. కాని ఏ నిముషాన ఏ భద్రకాళిలా విరుచుకు పడుతుందోనన్న భయంతో సత్యమూర్తి గుండె రైలుఇంజన్‌లా ధడక్ ధడక్ మంటూ కొట్టుకుంటూనే ఉంది. అందని ఊహల నిచ్చెనలు వేస్తూ ఊహాలోకాల్లో విహరిస్తున్నాడు సత్యమూర్తి. ఈ సారి ఆ అమ్మాయే సత్యమూర్తి చేతిమీద తన చెయ్యివేసి అతని కాళ్ళను కూడా తొక్కడం ప్రారంభించింది.

అంటే! సత్యమూర్తికి ఆ అమ్మాయి చిలిపిచేష్టలకు ఉబ్బి తబ్బిబ్బయి లైన్ క్లియరవుతోందని అనుకొని తనంత అదృష్టవంతుడు ఈ లోకంలోనే లేడనుకున్నాడు మనసులో. అదేపనిగా ఆమె ముఖాన్ని పరిశీలించసాగాడు. ఎంత అందమైన ముఖం చంద్రబింబంలా, కళ్ళు కలువరేకుల్లా, పలువరుస మల్లెమొగ్గలాగ తళతళ మెరుస్తున్నాయి. ఆ చెక్కిళ్ళు! అబ్బ! ఎంత అందంగా ఉన్నాయి. తను రచయితకాదుగా లేకపోతే ఈపాటికి కాలి బొటనవ్రేలి దగ్గరనుండి తల వెంట్రుకల వరకు వర్ణింతును అని అనుకున్నాడు మనసులోనే సత్యమూర్తి. ఆ అమ్మాయి మాత్రం ఎన్ని చిలిపిచేష్టలు చేస్తున్నా అదేపనిగా నాటకాన్ని కనురెప్పవేయకుండా చూస్తోంది.

అలా నాటకాన్ని చూస్తున్న సత్యమూర్తికి ఆ అమ్మాయి కాళ్ళకిందనున్న తన కాళ్ళని చీమలు తెగకుట్టసాగాయి. కాళ్ళని లాగేస్తే చక్కటి అవకాశం ఎక్కడపోతుందోనని ఎలాగో బాధను భరిస్తున్నాడు. చీమలు మాత్రం అదేపనిగా ఇంకా కుట్టేస్తున్నాయి. ఇక ఆ బాధను తట్టుకోలేక చీమల బారినుండి తప్పించుకోవడానికి గుండెధైర్యం చేసుకొని, అతి సున్నితంగా తనకాళ్ళని మెల్లిగా తీసి ఆ అమ్మాయి కాళ్ళపై వేసి సుతిమెత్తగా తొక్కడం ప్రారంభించాడు.

ఆ అమ్మాయి ఉన్నట్టుండి ఫక్కున నవ్వసాగింది. ఆ నవ్వు గలగలా ప్రవహిస్తున్న సెలయేరులా అనిపించింది సత్యమూర్తికి. ఇంతకూ ఆమె నవ్వుతున్నది తను చేస్తున్న చిలిపి చేష్టలకు అనుకున్నాడేగాని, ఆ నాటకంలో హాస్యసన్నివేశానికని సత్యమూర్తికి తెలియదు.

సత్యమూర్తికి ఇంకా ఏంచేయాలో తెలియక తికమకపడుతూ నాటకం అంతా అయిపోయిన తరువాత ఏదోవిధంగా కల్పించుకొని ఆ అమ్మాయితో మాట్లాడి ఏదోవిధంగా ఒప్పించి తన రూమ్‌కి తీసుకెళ్ళి ఆ అమ్మాయి అందాన్నంతా తనివితీరా అనుభవిద్దామనుకుంటున్న సమయంలో ఠక్కున లైట్లు వెలిగాయి.

ఆడిటోరియం అంతా వెలుతురు వ్యాపించి తెల్లవారినట్లయింది. అప్పుడు నాటకం అయిపోయినట్లు అనిపించలేదు సత్యమూర్తికి. అలా అనిపించగానే సత్యమూర్తి మనసు పరిపరివిధాలుగా పోయింది. ఆ అమ్మాయిని ఎలా మాటల్లోకి దించాలి, ఎలా మాట్లాడాలి, దేనిగురించి మాట్లాడాలి అని అనుకుంటున్న సమయంలో ఆ అమ్మాయి లేచి బయటకు వెళ్ళిపోయింది. వెంటనే సత్యమూర్తి కూడా బయటకు వెళ్ళిపోదాం అనుకున్నాడు. కాని తను ఈ సీట్లోంచి వెళ్ళిపోతే ఈ సీటును ఇంకొకడు ఆక్రమిస్తాడు. రెండో నాటికకు అప్పుడు తనకు ఆ సీటు ఉండదు. అందుకని ఆ సీటులోనే బల్లిలా అంటిపెట్టుకొని ఉండిపోయాడు. రెండో నాటికకు ఆమె వస్తుందో రాదో అని




అనుకుంటూ స్టేజీవైపు వెళ్తున్న ఆ అమ్మాయి వంక కొరకరా చూశాడు సత్యమూర్తి.

నాటకం బాగుందంటే బాగుందనుకొంటూ ప్రేక్షకులు తర్జన, భర్జనలు పడుతున్నారు. ఈ మాటలేవీ సత్యమూర్తి చెవుల్ని సోకటం లేదు. అసలు తను చూస్తేకదా? టైమంతా ఆ అమ్మాయితోనే సరిపోయింది.

ఆ అమ్మాయి వస్తుందో? లేదు? ఒకవేళ వస్తే ఈ సీటులో కూర్చుంటుందో లేదు? ఒకవేళ రాకపోతే ఏం చేయాలి? వస్తే ఏంచేయాలి? మరపురాని అందమైన అపూర్వమైన తియ్యని చక్కటి అవకాశాన్ని జారవిడుచుకోలేదు కదా? ఇందాకే అడిగేయవలసింది ఆ అమ్మాయిని. తప్పువని చేశాడు తను అని అనుకుంటుండగా ఒకడు వచ్చి సత్యమూర్తి ప్రక్కసీటులో కూర్చోబోయాడు.

"ఆ సీటులో మా వాళ్ళున్నారండీ అలా బయటకు వెళ్ళారు" అంటూ ఆ సీటులో కూర్చోకుండా చేశాడు.

ఇంతలో ఉన్నట్టుండి లైట్లు ఆరిపోయాయి. తెరపైకి లేచింది. మరల పిసినటి అప్సర తరువాత జరగబోయే నాటకం గూర్చి కొంచెం చెప్పి... "... ఈ కాలేజీ వార్షికోత్సవాల సందర్భంగా నాటకపోటీలతోపాటు ఇంతక్రితం ఫ్యాన్సీడ్రస్ పోటీ జరిగింది. ఈ పోటీలో ప్రథమ బహుమతి పొందిన బి. శ్యాంప్రసాద్, యం.బి.బి.యస్. ఊర్వశి వేషం" అని అనగానే కుందనపు బొమ్మలా, మేకప్‌తో ఒక అమ్మాయి వేదిక మీదకు రాగానే చప్పట్లతో మార్మోగిపోయింది ఆడిటోరియం అంతా.

అంతే! ఊర్వశి వేషంలో ఉన్న ఆ అబ్బాయిని చూడగానే సత్యమూర్తికి మతిపోయింది. గుండె ఆగినంత పనయింది. తన చుట్టూ ఉన్న మనుష్యులందరు వింత జంతువుల్లా కనబడి తనని తినడానికి, మ్రింగడానికి చూస్తున్నట్లు అనిపించింది. ఇంతసేపూ సరసాలాడింది ఒక అబ్బాయితోనా...? ఆ అబ్బాయితోనా తను చిలిపిచేష్టలు చేసింది? ఆడామగా తేడా తెలీకుండా ఎంత అజ్ఞానంలో ఎంత నీచస్థితిలో ఉన్నాన్నేను అనుకుంటూ............

మొద్దుబారిన బుర్రతో తాగినవాడిలాగా తప్పటడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు సత్యమూర్తి అతని రూంకి. ●